క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పెదగంట్యాడ: 11 కేవీ దిబ్బపాలెం ఫీడర్, 11 కేవీ మదీనాబాగ్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొడ్డువానిపాలెం, గొందేశి వీధి, కండిపల్లి వీధి, వెంకన్నపాలెం, కొంగపాలెం, సత్యనారాయణపురం, యాతపాలెం, ఉప్పరకాలనీ, గంగవరం, బడేవారి వీధి, జాలరిపల్లిపాలెం, దారకొండ, దిబ్బపాలెం, మదీనాబాగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం: నిర్వహణ పనుల కారణంగా బీహెచ్‌పీవీ 11 కేవీ, షీలానగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కిరెడ్డిపాలెం, డైయిరీ క్వార్టర్స్, పంచవటీ, జీవీఎంసీ వాటర్ వర్క్స్, బీపీసీఎల్ పెట్రోల్ బంక్, ఏషియన్ పెయింట్స్, వికాస్ కాలేజీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా గోదాదేవి తిరునక్షత్ర పూజలు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్ – 1లో వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం గోదాదేవి అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తిరు నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భావనారాయణ స్వామి నేతృత్వంలో అర్చకులు హరి నారాయణ, మనోజ్ స్వామి ఆధ్వర్యంలో వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అక్కిరెడ్డిపాలెం: గోదాదేవి అమ్మవారి తిరునక్షత్రం (పుట్టినరోజు) సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బుధవారం బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో కొలువైన గోదాదేవి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా అమ్మవారికి ఆలయంలో పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన (కుంకుమార్చన), అమ్మవారికి తిరునక్షత్రతనయ విన్నపం వంటి పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని పూజించారు.

చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తాం

గాజువాక : చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పాతగాజువాకలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేత కార్మికులను ఆదుకోవడం కోసం వారికి రుణాల మంజూరుకు కావాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చేనేత సంఘాల నాయకులు పప్పు రాజారావు, దొడ్డి సత్యారావు, పప్పు శంకరరావు, నామాల సింహాచలం, మాడెం అప్పారావు, బాబ్జి, పిల్లి చంద్రశేఖర్, నామాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేజీహెచ్ ఏవోగా మంగరాజు



మంగరాజును అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, అధికారులు

మహారాణిపేట: కేజీహెచ్ ఏవోగా ఎస్.మంగరాజు నియమితులయ్యారు. బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నగరంలో ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ఆఫీసు సూపరింటెండెంట్‌గా, గతంలో కేజీహెచ్ సీనియర్ అసిస్టెంట్‌గా మంగరాజు విధులు నిర్వర్తించారు. ఆయన పదోన్నతిపై కేజీహెచ్ ఏవోగా నియమితులయ్యారు. ఆయనను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, మేనేజర్ సీఎం జవహర్‌లాల్, సీనియర్ అసిస్టెంట్లు బాలకృష్ణ, నూకరాజు, ప్రకాష్, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు అభినందించారు.

భయం భయం..

- ప్రమాదకరంగా ఆటోనగర్ బి–బ్లాక్ రోడ్డు
- ఎక్కడపడితే అక్కడే గోతులతో నరకాన్ని తలపిస్తున్న ప్రయాణం
- అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న ప్రయాణికులు



ఆటోనగర్ బి–బ్లాక్ ప్రధాన రోడ్డులో ఏర్పడిన గోతులు



ఆటోనగర్ ఆర్చి ప్రవేశం వద్ద రోడ్డుపై వర్షం నీటితో నిండిన గోతులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ బి–బ్లాక్‌లోని రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో నిత్యం పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ మధ్య కురిసిన వర్షాలకు ఈ రోడ్డులో పలు ప్రాంతాలు ఛిద్రం అయ్యాయి. అడుగు లోతు గోతులు ఏర్పడి వర్షం నీటితో నిండిపోవడంతో ఎక్కడ రోడ్డు ఉందో.. ఎక్కడ గోతులున్నాయో తెలియక పలువురు వాహన చోదకులు ప్రమాదాలకు గురై గాయాల పాలయ్యారు. పారిశ్రామిక ప్రాంతానికి ఇదే ప్రధాన రోడ్డు కావడంతో పలు బ్లాక్‌లకు వెళ్లాలంటే ఈ రోడ్డు నుంచే భారీ, అతి భారీ వాహనాలు ప్రయాణించాల్సిన పరిస్థితి. ఇలా విపరీతమైన రద్దీతో కూడుకున్న ఈ రోడ్డు గుంతలు పడి శిథిలం కావడంతో భారీ వాహనాల రాకపోకల సమయంలో ద్విచక్ర వాహన చోదకులు వాటిని తప్పించలేక ఈ రోడ్డుపై ఉన్న గోతుల్లో పడి ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు.

ప్రధాన రోడ్డు నిర్మాణానికి త్వరలోనే టెండర్లు ఖరారు..

ఆటోనగర్ బి–బాక్‌లో ప్రధాన రోడ్డు నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలుస్తామని ఆటోనగర్ ఐలా చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి, ఐలా కమిషనర్ జయచంద్ర తెలిపారు. రూ.11.5 కోట్ల వ్యయంతో నూతన రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేపట్టారు. 40 శాతం ఏపీఐఐసీ, 60 శాతం సెంట్రల్ గవర్నమెంట్ నిధుల కేటాయింపుతో నూతన రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. గతంతో రోడ్డు విస్తరణ, మధ్యలో గ్రీనరీ, ఇరుపక్కల విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రాత్రి వేళల్లో ప్రమాదాలు

ఆటోనగర్ నుంచి వడ్లపూడి వెళ్లాలంటే బి–బ్లాక్ రోడ్డు ప్రధాన మార్గం. ఈ రోడ్డుపై రాత్రి సమయంలో పనులు ముగించుకుని తిరిగి వడ్లపూడి వెళ్లాంటే వాహనాలతో గోతుల్లో పడి పలుమార్లు ప్రమాదాలకు గురయ్యాం. వర్షాకాలం వస్తే మరీ ప్రమాదకరం. గోతులు నీళ్లతో నిండిపోవడంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియని పరిస్థితి. గోతులు కూడా లోతుగా ఉండటంతో భయంగా ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు వెంటనే రోడ్డును నిర్మించాలి.

– వేణుగోపాలరావు, వడ్లపూడి

భారీ వాహనాలతో ఇబ్బందులు

ఆటోనగర్‌లోని పలు బ్లాక్‌లకు వెళ్లాలంటే బి–బ్లాక్ రోడ్డు ప్రధానమైంది. ఈ రోడ్డు గుండా నిత్యం ఆటోనగర్‌లోని పలు పరిశ్రమలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలతో పాటు కొన్ని వేల ఇతర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. వడ్లపూడి, అగనంపూడి, కూర్మన్నపాలెం, ఫకీర్‌తక్యా, ఎఫ్, ఈ, ఈ ఎక్స్‌టెన్షన్ వంటి ప్రాంతాల నుంచి గాజువాక తదితర ప్రాంతాలకు దగ్గరి మార్గం కనుక ఈ రోడ్డునే ఆశ్రయిస్తుంటారు. ఇటువంటి రోడ్డును నాణ్యమైనదిగా నిర్మించాలి.

– శశిభూషణరావు, గాజువాక

త్వరలోనే సమస్యకు పరిష్కారం

ఆటోనగర్ బి–బ్లాక్ రోడ్డు సమస్య త్వరలోనే తీరనుంది. ప్రధాన రోడ్డుపై గోతుల సమస్య ఉన్నమాట వాస్తవమే. ఈ మధ్య కాలంలో ప్రమాదకరంగా ఉన్న కొన్ని చోట్ల ప్యాచ్ వర్క్‌లు చేపట్టాం. నూతన రోడ్డు నిర్మాణానికి టెండర్లు ఖరారు చేసి త్వరలో నిర్మాణం చేపడతాం.

–జయచంద్ర, ఆటోనగర్ ఐలా కమిషనర్.

చేనేతకు చేయూతనివ్వండి



నిరుపేదలకు చేనేత చీరలు, పంచెలు పంపిణీ చేస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: చేనేత వస్త్రాలకు ప్రభుత్వాలు చేయూతనిస్తే, కార్మికులు, వృత్తి పనిచేసే వేలాది కుటుంబాలు ప్రశాంతంగా బతుకుతాయని శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు, దువ్వాడ రైల్వేస్టేషన్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఆర్‌హెచ్‌సీ పెదమడకలోని శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా పద్మశాలీల ఆరాధ్య దైవం భావనారుషి పద్మావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు చేనేత వస్త్రాలను ధరించగలిగితే చేనేత వృత్తివారికి ఊతమిచ్చినవారవుతారన్నారు. ఉక్కు కార్మిక సంఘం నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మనిషికి చేనేత వస్త్రాలు మరింత అందాన్నిస్తాయన్నారు. అటువంటి వాటిని మనం పక్కన పెడుతుండడంతో చేనేత కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. రెండున్నర దశాబ్దాలుగా అగనంపూడి ప్రాంతీయులకు సేవలందిస్తున్న సేవా సంఘానికి సామాజిక భవనం నిర్మించుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా నిరుపేద మహిళలకు, వృద్ధులకు చేనేత చీరలు, పంచెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు గంధోళి పైడికొండ, వెంకటరమణ, నరసింగరావు, గుడే రాజు, మణికంఠ, ప్రసాద్, పచ్చారి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు

విలువలతో విద్య అందించడమే లక్ష్యం



విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరిస్తున్న విజ్ఞాన్ యాజమాన్యం

అగనంపూడి: చదువు, సంస్కారంతోపాటు నైతిక విలువలతో కూడిన విద్యను అందించడమే విజ్ఞాన్ విద్యా సంస్థల లక్ష్యమని ఆ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను బుధవారం ఘనంగా సత్కరించారు. అలాగే మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు ఎంత ప్రాధాన్యమిస్తున్నామో అదే స్థాయిలో విలువలు, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. 1444 మంది విద్యార్థులకు వివిధ సంస్థలు ఉద్యోగావకాశాలు కల్పిస్తే 1009 మంది చేరేందుకు సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాళ్లు జె.సుధాకర్, బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, డీన్లు బోడే ప్రసాద్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



టౌన్‌సర్వీస్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్ : ప్రజలకు అందించే తాగునీరు కలుషితం కాకుండా, నిత్యం నీటి తనిఖీలు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మంచినీటి విభాగం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టౌన్‌సర్వీస్ రిజర్వాయర్(టీఎస్ఆర్)ను బుధవారం సందర్శించి జలాశయాల నుంచి నగర ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరా ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు కలుషితం కాకుండా, సురక్షిత తాగునీటిని అందించాలని, ఆ దిశగా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవిని ఆదేశించారు. నగరానికి ఎన్ని జలాశయాల నుంచి నీటి సరఫరా జరుగుతుంది? ఎన్ని రిజర్వాయర్లు ఈఎల్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులున్నాయని ఆరా తీశారు. నగరంలో ఏడు జలాశయాల నుంచి నగరానికి నిత్యం 388 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి ప్లాంట్ల ద్వారా నీటి సరఫరా అవుతుందని, 48 మినీ రిజర్వాయర్లు, 100 ఈఎల్ఎస్ఆర్, 146 జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు ఉన్నాయని, వీటి ద్వారా నాణ్యమైన నీటిని నిత్యం ప్రజలకు అందించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అంతేకాక సచివాలయాల పరిధిలో 2500 నీటి నాణ్యత పరీక్షలు నిత్యం జరుపుతూ ప్రజలకు ఉదయం 4.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రాంతాల వారీగా రోజూ 45 నిమిషాల నుంచి ఒక గంట సమయం పాటు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నట్లు వివరించారు. వంద రోజుల ప్రణాళిక, స్టాప్ డయేరియా కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు మంచినీటిని అందించాలని, కాల్వలు, కల్వర్టుల్లో ఉన్న తాగు నీటి పైపులైన్ లీకులను అరికట్టి, వాటి వద్ద నీరు కలుషితం కాకుండా మార్పు చేసి త్వరితగతిన అమర్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టీఎస్ఆర్‌లో గల పంప్‌హౌస్‌ను పరిశీలించి విద్యుత్ వినియోగం తగ్గించేలా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీరు కేవీఎన్ రవిని కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజినీరు శేఖర్, ఉపకార్య నిర్వహక ఇంజినీరు సతీష్, సహాయక ఇంజినీరు స్రవంతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు



విశేష అలంకరణలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఉదయం వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజల్లో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంగా తినేలా ‘మధ్యాహ్న భోజనం’



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులు ఇష్టంగా తినేలా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం అమలుపై విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్టీరింగ్, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం అమలులో రైస్ మినహా, మిగిలిన మెనూ అంతా బాగుందని తెలిపారు. బియ్యం బాగాలేకపోతే వాటిని తిప్పి పంపాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్న భోజనం కోసమే బడికి వచ్చే విద్యార్థులు చాలా మంది ఉన్నారని, ఇటువంటి పరిస్థితిలో పిల్లలు ఇష్టపడి తినేలా పదార్థాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఈ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఎంపీడీవో తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు పారిశుధ్యం పనులు పరిశీలించాలని జెడ్పీ సీఈవోకు సూచించారు. వారంలో రెండు పాఠశాలలు సందర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల వివరాలను ఆర్‌బీఎస్ నోడల్ అధికారికి తెలియజేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో 584 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎం.శోభారాణి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీదేవి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



అగనంపూడిలో పట్టుకున్న పీడీఎస్ రైస్

మహారాణిపేట: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)కు చెందిన బియ్యాన్ని బుధవారం పౌర సరఫరాల శాఖాధికారులు పట్టివేశారు. డీఎస్‌వో సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో చెక్కింగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపట్టారు. డాబాగార్డెన్‌లో అనధికారికంగా ఓ వాహనంలో రవాణా చేస్తున్న పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. అగనంపూడి, పెదమడక ప్రాంతాల్లో నిల్వ ఉంచిన 400 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే తగరపువలసలో అక్రమంగా నిల్వ ఉంచిన 300 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు మొత్తం 4,700 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్‌వో సూర్యప్రకాశరావు తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలను కూడా సీజ్ చేశామన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోం

- మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అగనంపూడి: నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలంగా నిలిచిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో బుధవారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. 1273వ రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులు నామమాత్రపు ధరకు 23 వేల ఎకరాల స్థలం ధారాదత్తం చేశారని, ప్రస్తుతం ఆ భూములపైనే బడాబాబులు కన్నేశారని ఆరోపించారు. ఆ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకుంటున్న వారికి కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ పెద్దలు చూస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన అధినేతలు చొరవ తీసుకుని ప్రైవేటీకరణను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కర్మాగారానికి తక్షణ సాయంగా రూ.5 వేల కోట్లు అందివ్వాలని, సొంతంగా గనులు కేటాయించాలని, ఆర్ఐఎన్ఎల్‌లో విలీనం చేయాలని కోరారు. తెలుగు రాష్ట్రాల ఇంటక్ ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ వేలాది మంది నిర్వాసితులు, ఉక్కు ఉద్యోగుల ఉపాధికి గండి కొట్టాలని కేంద్రం చూస్తోందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది జీవనం సాగిస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని చూడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు ఎన్నేటి రమణ, చిత్రాడ రమణ, ఆడారి శ్రీను, పల్లా చినతల్లి, కర్రి దాలినాయుడు, కంద్రేగుల శ్రీనివాసరావు, పల్లా పెంటారావు పాల్గొన్నారు.

‘టచ్’లపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దువ్వాడ సీఐ ఎర్రం నాయుడు

అగనంపూడి: గుడ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, ఈ రోజుల్లో ఏ వయసు వారినీ, బంధువులనూ నమ్మడానికి వీలు లేదని దువ్వాడ ఇన్‌స్పెక్టర్ వావిలపల్లి ఎర్రం నాయుడు సూచించారు. కూర్మన్నపాలెంలోని రామకృష్ణ పాఠశాలలో విద్యార్థులకు వివిధ చట్టాలు, నేరాలు, వాటి ప్రభావం, టచ్‌లపై అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయిలోనే కొంత మంది విద్యార్థులు మత్తు మందులకు అలవాటు పడుతున్నారని, జీవితాన్ని మలుపు తిప్పే ఈ వయసులో చక్కగా చదువుకోవాలని సూచించారు. గంజాయి, హెరాయిన్, మద్యం, సిగరెట్ వంటి వ్యసనాలను దరిచేరనీయ వద్దన్నారు. పోక్సో చట్టం, గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. వయసుతో సంబంధం లేకుండా బంధువులు అయినా సరే దురుద్దేశంతో టచ్ చేస్తే క్షమించరాదన్నారు. టీనేజ్ తుఫాన్ లాంటిదని, సముద్రంలో వచ్చే వాయుగుండం లాంటిదన్నారు. ఈ వయసులో మనసు కట్టడి చేసుకుని ఉన్నతంగా ఆలోచిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపితే కలిగే కష్టాలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పొన్నాడ వాసుదేవరావు, డైరెక్టర్ లలిత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెదగంట్యాడ: జన్మనిచ్చిన తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారని ఐసీడీఎస్ పెదగంట్యాడ సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం దిబ్బపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ పరిధిలోని 25 మంది గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువుకు గంటలోపు తల్లి ముర్రుపాలు తాగిస్తే బిడ్డకు వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు 16న జీతాలు

ఉక్కునగరం: ఒకటి రెండు రోజుల్లో జీతం వస్తుందని ఆశించిన స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నిరాశ కలిగించే వార్త ఇది. కార్మికుల జీతాల కోసం మూడు ప్రధాన కార్మిక సంఘాల నాయకులు బుధవారం స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను కలవగా ఆయన నుంచి వచ్చిన సమాధానమిది. నాయకులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. కార్మికులకు జీతాలు చెల్లించాలని నాయకులు కోరగా... ఈ నెల 10న జీఎస్టీ రూ.180 కోట్లు చెల్లించాల్సి ఉందని, బొగ్గుతో వస్తున్న రెండు నౌకలకు సంబంధించి పేమెంట్ చేయాలని సీఎండీ భట్ తెలిపారు. ఈ నేపథ్యంలో 16న కార్మికులందరికీ పూర్తి జీతాలు చెల్లిస్తామని చెప్పడంతో నాయకులు వ్యతిరేకించారు. రెండు రోజుల్లో జీతాలు చెల్లించకుంటే కార్మికుల అశాంతికి యాజమాన్యం బాధ్యత వహించాలని చెప్పినట్టు నాయకులు తెలిపారు. అయినప్పటికీ యాజమాన్యం వైఖరి మారనట్టు తెలిసింది. సమావేశంలో కె.ఎస్.ఎన్.రావు, నరేష్‌కుమార్, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మెరుగైన సిలబస్‌తో విద్యార్థుల ఉన్నతి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

అల్లిపురం: స్వయం ప్రతిపత్తి పొందిన విశాఖ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల అభివృద్ధికి అనుగుణంగా సిలబస్ రూపొందించాలని పలువురు ఆచార్యులు అభిప్రాయపడ్డారు. కళాశాల స్వయం ప్రతిపత్తి పొందిన సందర్భంగా బోర్డు ఆఫ్ స్టడీస్ మొదటి సమావేశం బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల నాణ్యతా ప్రమాణాలను పెంచే దిశగా స్వయం ప్రతిపత్తి ఉపయోగపడుతుందన్నారు. జీవనోపాధికి అవకాశం కలిగే విధంగా సిలబస్ రూపొందించేందుకు తగిన సలహాలు, సూచనలు అందించాలని ఆమె కోరారు. ఏయూ భౌతికశాస్త్ర ఆచార్యులు కె.సమత, మైక్రో బయాలజీ ఆచార్యులు డాక్టర్ వి.లక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పీఎల్ శరణ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ డి.అరుణపద్మ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఆర్. కిరణ్మయి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

11న జూలో చిత్రలేఖనం పోటీలు

ఆరిలోవ: ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11న జూ పార్కులో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో ఒకటో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు బహుమతులు, ప్రోత్సహకాలతో పాటు పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. చిత్రలేఖనానికి అవసరమైన పెన్సిల్, క్రెయాన్స్, స్కెచ్, వాటర్ కలర్స్, తదితర సామగ్రిని విద్యార్థులు తమ వెంట తీసుకురావాలని ఆమె సూచించారు. చిత్ర లేఖనానికి అవసరమైన పేపర్లు జూ లో అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు 94408 10213 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కేటగిరీ–1లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ‘మై ఫేవరేట్ ఎలిఫెంట్’, కేటగిరీ–2లో 6 నుంచి 10వ తరగతి వరకు ‘ది మేజెస్టిక్ ఎలిఫెంట్ గార్డియన్ ఆఫ్ ది ఫారెస్ట్’, కేటగిరీ–3లో ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు ‘ఎలిఫెంట్స్ యాజ్ ఎకోసిస్టిమ్ ఇంజినీరింగ్’పై చిత్రాలు వేయాల్సి ఉంటుందని క్యూరేటర్ తెలిపారు.